# తుఫాన్

గిరిజా నారాయణ్



తుఫాన్!... ... ...
గంజి నీళ్ళ కోసం తుఫాన్.
ఆప్కో చీరె కోసం తుఫాన్.
రెండ్రూపాయల బియ్యం కోసం తుఫాన్.
పూరిపాకల కోసం తుఫాన్.
బురద గుంటల కోసం తుఫాన్.
శూన్యపు జీవితాల్లో ఆశల తుఫాన్.
గరీబును భూస్థాపితం చేసే తుఫాన్.
అసలు సిసలైన బంగాళా తుఫాన్.
తుఫాను వెనుక శతకోటి రాజకీయాల తుఫాన్.
తుఫాన్... తుఫాన్... తుఫాన్!...

ఎనిమిదేళ్ళ సత్తిగాడు చదువుతున్న కవితకు గుడిసెలోంచి కసురుకొంది రత్తి.

"ఏట్రా? తుఫాను, తుఫాను అంటూ ఆ కాకి గోల?" సత్తికి చిర్రెత్తుకొచ్చేలా అరిచింది.

"ఎహె, నీ కర్థం కాదులే నా కయిత్వం వెనుక భావం. ఇగో సరిగా ఇనుకో. ఇయ్యాల రేపు భయంకరమైన తుఫానుండాదని గిప్పుడే రేడియోలో సెప్పుండారు. అదినగానే కయితొచ్చేసింది నోట్లోంచి" అంటూ తనలో అప్పుడే తప్పటడుగులేస్తున్న బాల కవిభానుడ్ని జోబుచ్చేశాడు సత్తి - తల్లి కసురుకు ప్రతి చర్యగా.

ఉరుములు ఫెళ ఫెళలు... రయ్యిమని వీచే గాలి ఈలల హోరు... పాక కప్పులు ఎగిరి పోతుందేమోనన్న గుబుళ్ళు సత్తి, రత్తి గుండెల్లో ఏక కాలంలో. రత్తి బైటకొచ్చి ఆకాశం వంక చూసిం దోసారి. ప్రొద్దుట్నించి కమ్మిన కారు మబ్బులు భూతాల్లా, రాక్షసుల్లా ఘీంకరిస్తూ, గర్జిస్తూ ప్రచండంగా కుంభవృష్టి కురిపిస్తున్నాయి.

ఏదో మామూలు వర్షమేమో అనుకున్న రత్తికి సత్తిగాడు మాటలు గుండెల్లో అగ్ని పర్వతాన్ని బ్రద్ధలయ్యేలా చేశాయి.

క్రిందటేడు తుఫాను వల్ల జగ్గయ్య దొర వద్ద చేసిన అప్పుల ఫలితంగా ఆ దొర పొలం కూలి వడ్డీ క్రింద ఈ యేడు తన భర్త ఎల్లయ్య చేస్తున్న చాకిరీ, ఈ యేడు పంటనమ్మి అసలు తీరుస్తానని ఎల్లయ్య రాసిచ్చిన కాయితాలు, ఉన్న యిల్లు అమ్మి పంచేసుకుని శ్మశానం గట్టున తాము పాకేసుకున్న ఆ చీకటి రోజులు ఒక్కసారి రత్తి మనో మందిరంలో మెదిలాయి. ఆమె కళ్ళు చెమర్చాయి.

ఇంతలో ఎల్లయ్య పొలం కాపుకుపోతూ "రేతిరికి రాను. అక్కడే గట్టున పాకలో తొంగుంట. సత్తిగాడికి టిపిని డబ్బా యిచ్చి బేగినే పంపు" అని చెప్పిన సంగతి గుర్తొచ్చి గబగబా జొన్న రొట్టెలు నాలుగు పొయ్యిపై కాల్చి డబ్బాలో వేసి సత్తిగాడికిచ్చి జాగ్రత్తగా పోయి రమ్మంది. వర్షానికి తడవకుండా గోతం నంచి వాడిపై కప్పింది.

జొన్న రొట్టెలు తీసుకుని పాల బుగ్గల మెరుపు కళ్ళ సత్తిగాడు కవితా మబ్బుల్లో విహరించడానికి బయల్దేరాడు. వాడి కా వర్షంలో బయటి కెళ్ళి తుఫాను బీభత్సం ప్రత్యక్షంగా చూసి ఇంకా బాగా కవితలు రాయాలని లోలోన తహతహ. తన కోర్కె తల్లి మామూలుగా ఒప్పుకోనేది కాదని సంబరం యిప్పుడు.

వడగళ్ళు పడడం మొదలయింది. అప్పాపురం - పెదనందిపాడు కృష్ణ కాలువకు పొంగు వచ్చినట్లు ఎవ్వరికీ తెలియదు. గట్టు దాటి నీళ్ళు క్షణం క్షణం పరవళ్ళు, ఉరవళ్ళు తొక్కుతూ ఊరివైపు దూసుకు రాసాగాయి. సత్తిగాడు వడగళ్ళ ధాటికి తట్టుకోలేక పరిగెత్తబోయి కంప కాలికి చుట్టుకుని నీళ్ళలో మునిగాడు.

చలికి మందేసుకుని రంకులో సుఖమెతుక్కుంటున్న ఎల్లయ్య, తుఫాన్నూహించని ఎల్లయ్య, గుడిసె కూలి నీళ్ళ క్రింద వెంకమ్మతో సహా కూరుకుపోయాడు. పొలాలు తలలు వాల్చేశాయి.

రత్తి ప్రాణాలు బిగబట్టుకుని బయటికి పరిగెట్టింది నల్గురితోటి. గుడిసెలు గాలిపటాల్లా ఎగిరిపోయాయి. మూడ్రోజులు వీధీ, వాడా ఊరు తిరిగేసి మట్టుబెట్టి మాయమైంది తుఫాన్.

నాల్గో రోజు ముఖ్యమంత్రి వచ్చాడు. జీపుల జర్ జర్‌లు... ఆఫీసర్ల గిరికీలు. గంభీరంగా విషాదం ఫోజు ఇచ్చాడు ముఖ్యమంత్రి. ఆయన్ని అలా చూడగానే రత్తితో సహా అందరూ ఏడ్చేశారు భోరున. సిన్మాలో ఆ హీరో కష్టాల్లో ఉన్న దృశ్యం వాళ్ళ కళ్ళ ముందు మెదిలినట్లయింది. "ఓ నా తెలుగు ఆడపడుచుల్లారా" అంటూ ముఖ్యమంత్రి రత్తిని గట్టిగా కౌగిలించుకుని ఉక్కిరిబిక్కిరి చేశాడు. రత్తి గువ్వలా ఒదిగిపోయింది. ఆయన బాహువుల మధ్య. ప్రజల కన్నీ అందచేస్తానని, పక్కా ఇళ్ళు కట్టిస్తానని హామీల కుప్పలు పోశాడు. ఆ జోరుకు అదిరిపోయింది రత్తి "అన్న" మాటంటే మాట్టే అన్నారు మిగతా వాళ్ళంత.

టీ. వీ. లు, కెమెరాలు క్లిక్, క్లిక్‌లు. సంబరపడింది రత్తి. కాని అన్న చెప్పినవి ఏవీ జరగలేదు. ఇంతలో మరో వర్గం వాళ్ళు వచ్చారు. ప్రధాన మంత్రి వస్తున్నాడని చెప్పారు. "ఈ అన్న కాకపోతే పెద్దన్న వస్తున్నాడు కదా - తమ సంగతి పట్టించుకోకపోతాడా?" అని ఊరడిల్లింది రత్తి లోలోనే.

"ప్రైదాన మంతిరితో మళ్ళీ ముక్కెమంతిరొచ్చాడేమిటబ్బా?" అనుకుంది రత్తి. మధ్యలో ఎవరో మంత్రులు ప్రైదాన మంతిరికి సెప్తండారేంటి? అని కూడా అనుకొంది. తను ఏదో సెప్పాలనుకుంది. తన భర్త, బిడ్డ సనిపోయారని సెప్పాలనుకుంది. క్రిందటేడు అప్పు అలానే ఉందని, ఈ యేడు పొలం పూర్తిగా పోయిందని సెప్పాలనుకొంది. తమ కే సాయం అందలేదని సెప్పాలనుకుంది.

ముందుకొచ్చి ప్రధాన మంత్రితో ఏదో మాట్లాడబోయింది. ప్రధాని ఏదో అడిగాడు రత్తిని. రత్తి సమాధానం మరేదో. ఇంతలో ముఖ్యమంత్రి, మరో మంత్రి "యూ ఫూల్ అంటే యూ ఫూల్" అని అరుచుకోవడంతో భయపడిపోయింది రత్తి. ప్రధాని చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు.

రత్తి మరుదులు డేగల్లా దిగారు రంగంలోకి. ఎవర్ని పట్టుకుని రత్తికి రావల్సినవి వసూలు వేసుకున్నారు. ఎవరు ఎవరికి సాయం చేస్తున్నది. తనిఖీ లేని సమయం. దోచుకునే దొరబాబులకు సువర్ణావకాశం. బ్రోకర్లకు, పార్టీలకు పండుగ రోజులవి.

రత్తికి తన కొడుకి సత్తి చెప్పిన కవిత యిప్పుడు బోధపడింది. తనకేమీ రాదని తేలిపోయింది రత్తికి. బరువెక్కిన హృదయంతో, విషణ్ణ వదనంతో పొట్ట పట్టుకుని అప్పాపురం రోడ్డు పట్టింది ఆ రాత్రి. తళుక్కున ఏదో మెరుపు ఆమెలో. నవ చైతన్యం ఏదో ఆమెను తాకింది.

చచ్చిన శవాల నడుమ
కన్నీటి నాటకాల తుఫాన్
కాలిన కడుపుల ధ్య
మంత్రుల సంబరం తుఫాన్
అబద్ధాల హామీల తుఫాన్
దొర దొంగల దోపిడీ తుఫాన్.

అప్రయత్నంగా రత్తి గుండెల్లోంచి, వేదనలోంచి సత్తిగాడు పల్కించిన పల్కు లివి. రత్తే ఆశ్చర్యపోయింది తన భావావేశానికి. రత్తిప్పుడు రచయిత్రి. విప్లవ రచయిత్రి. మరో విప్లవ తుఫాన్‌కు పథకం సిద్ధం చేస్తున్నది -చావ కింద నీరులా మార్పు కోసం. ★

---

బ్రిటన్‌లో 50-70 సంవత్సరాల క్రింద ఆడవాళ్ళకు ఓటు వేసే హక్కు లేకుండింది- అనేది మీకు తెలుసా? 'ఎమలైన్ ప్యాంక్ హర్ట్స్' అనే ఓ మహిళ-ఆడవాళ్ళకు కూడా ఓటు వేసే హక్కుండాలని 1880లో తన పోరాటాన్ని కొనసాగించింది. లేబర్ పార్టీ వారిని కలుపుకుని సత్యాగ్రహాలు చేసింది. గొలుసులతో తమను తామే బంధింపజేసుకుంది. లెక్క లేనన్నిసార్లు జైళ్ళకు వెళ్ళింది. 1914లో జరిగిన ప్రపంచయుద్ధంలో ఆడవాళ్ళు ఆమె ఆయుధకర్మాగారాల్లో చేసిన కృషికి మెచ్చుకుని ఆడవాళ్ళకు ఓటు హక్కు ఇచ్చింది. అయితే 30 ఏండ్లు దాటిన వారికే ఆ హక్కు ఇచ్చింది. ఎమలైన్ ప్యాంక్‌హర్ట్స్ 1928లో మరణించింది.

చాగాపురం